

ఓయూను సందర్శించి వీసీ రవీందర్‌తో చర్చిస్తున్న తుర్కమెనిస్తాన్ ఎంబసీ ప్రతినిధుల బృందం

## విదేశీ విద్యార్థులకు ఓయూలో మెరుగైన వసతులు

సికింద్రాబాద్, డిసెంబర్12 : తుర్కమెనిస్తాన్ ఎంబసీ ప్రతినిధి బృందం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని మంగళవారం సందర్శించింది. తుర్కమెనిస్తాన్ కాన్సుల్ సెక్రటరీ షాహ్మహమ్మత్ ముహమ్మదేవ్, రాయబార కార్యాలయ చాన్సరీ హెడ్ మెయిలిస్ బాషిమోవ్ నేతృత్వంలోని బృందం ఓయూ ఉపకులపతి ఆచార్య దండెబోయిన రవీందర్, రిజిస్ట్రార్ ఆచార్య పి. లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ఆచార్య రెడ్యానాయక్, విదేశీ విద్యార్థుల వ్యవహారాల డైరెక్టర్ ఆచార్య ఎల్. శివరామకృష్ణ, అదనపు డైరెక్టర్ ఆచార్య సరితారెడ్డి, డాక్టర్ టీవీఎస్ లక్ష్మి, ఫర్హీన్‌ల బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఓయూలో విదేశీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను యూజీలో విద్యను అభ్యసించటానికి పద్దెనిమిది మంది, పీజీలో ఇద్దరు తుర్కమెనిస్తాన్ విద్యార్థులు ఓయూలో విద్యాభ్యాసం చేస్తున్నారని ఆచార్య శివరామకృష్ణ వివరించారు. వివిధ దేశాలకు చెందిన మరో 50 మంది విద్యార్థులు ఓయూ పరిధిలో చదువుకుంటున్నారని వెల్లడించారు. విదేశీ విద్యార్థులకు సంబంధించిన విద్యా సంబంధిత అవకాశాలు, వసతులపై ఈ సందర్భంగా ఆయన వివరణ ఇచ్చారు. అనంతరం తుర్కమెనిస్తాన్ విద్యార్థులు, ఓయూలోని ఎంబసీ సభ్యులు,అడ్మినిస్ట్రేషన్ సభ్యుల మధ్య పరస్పర చర్చా కార్యక్రమం జరిగింది.



## చేనేతకు చేయూత

శ్రీనగర్ కాలనీలోని సత్యసాయినిగమాగమంలో మంగళవారం ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు ఏసిన చేనేత ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మిస్ ఏషియా ఇంటర్నేషనల్, నటి రష్మి ఠాకుర్

**- వెంగళరావునగర్, డిసెంబర్ 12**

## హజ్ యాత్రికులకు ప్రత్యేక పాస్‌పోర్ట్ కౌంటర్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : హజ్ యాత్రికుల పాస్‌పోర్ట్ దరఖాస్తుల ప్రక్రియకు సికింద్రాబాద్ ఆర్‌పీవో పరిధిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జే. స్నేహజ తెలిపారు. ఈ నెల 13, 15, 18న ఈ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. హజ్ యాత్ర చేయాలనుకునే వారు తప్పనిసరిగా తమ పాస్‌పోర్ట్ గడువు 2025 జనవరి 31 వరకు ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ హజ్ కమిటీ ఆమోదం తెలిపిన పాస్‌పోర్ట్ దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని వివరించారు.



### ఉపాధి, ఆర్థికాభివృద్ధి బెల్ట్‌గా

# మూసీ పరీవాహక ప్రాంతం

### సీఎం రేవంత్ రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి, ఆర్థికాభివృద్ధి బెల్ట్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రవహిస్తున్న ప్రాంతాలను పర్యాటక, స్వీయ ఆర్థిక చోదక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మూసీ నది వెంట ప్రభుత్వ- ప్రైవేట్-పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో బ్రిడ్జిలు, కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, హాకర్ జోన్‌లు, పాత్‌వేలను నిర్మించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మూసీలో కాలుష్యం తగ్గించడంతో పాటు మురుగునీరు ప్రవహించకుండా అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. మూసీలో శుద్ధి చేసిన నీరు ప్రవహించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు తగు నీటి మట్టం ఉండేలా చెక్ డ్యాంలు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జలమండలి ఎండి దానకిశోర్, సీఎంవో అధికారులు శేషాద్రి, శివధర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధి బృందం

## అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

హిమాయత్‌నగర్, డిసెంబర్12: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే ఉద్యో గుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, వెల్ఫేర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది.

మంత్రి సీతక్కను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి, ప్రతినిధులు ప్యారీజాన్, సుచిత్ర, ఐలమ్మ, ప్రేమలత, రమా, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.



## మంత్రి శ్రీధర్‌బాబుతో టీఎన్జీవో నేతల భేటి

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్‌హుస్సేనీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు

**- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 12**



కీసరగుట్టలోని గర్భాలయంలో అన్నాభిషేకం

## కీసరగుట్టలో అన్నాభిషేకం

### ముగిసిన కార్తీక మాసోత్సవం పూజలు

కీసర, డిసెంబర్ 12 : కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవం పూజలు అన్నాభిషేకంతో ముగిశాయి. మంగళవారం గర్భాలయంలో ఆలయ చైర్మన్ తటాకం రమేశ్ శర్మ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంను నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో ఉన్న శివుడికి అన్నంతో పూర్తిగా కప్పి అన్నాభిషేకంను నిర్వహించారు.



మంత్రి సీతక్కను కలిసిన జిల్లాల బాలల సంరక్షణ అధికారులు

## స్త్రీ శిశు సంక్షేమ శాఖలో సమస్యలను పరిష్కరిస్తా

### స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క

మేడ్చల్, డిసెంబర్12(నమస్తే తెలంగాణ) : స్త్రీ శిశు సంక్షేమ శాఖలో పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తానని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క హామీ ఇచ్చారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో రంగారెడ్డి-మేడ్చల్ జిల్లాల బాలల సంరక్షణ అధికారులు మంగళవారం మంత్రి సీతక్కను కలిశారు. ఐసీపీఎస్, ఐసీఎస్‌డీఎస్‌లోని అన్నిశాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అనాథ పిల్లల వివరాలు, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో అధికారులు ఇంతియాజ్ రెహమాన్, జీ. ప్రవీణ్‌కుమార్, సరస్వతి, శ్రీలత, వి. ప్రవీణ్‌కుమార్, విజయలక్ష్మీ ఉన్నారు.







## అభినందనల వెల్లువ

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా నియమితులైన దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో మంగళ వారం మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కత్తి జనార్దన్, డీఎంహెచ్‌వోలు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ రాజశ్రీ తదితరులు - సుల్తాన్‌బజార్/సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)